క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

దామెర: మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని ఎస్‌బీఐటీ ప్రాంగణంలోని కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంఈసీలో 20, సీఈసీలో 15 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఎన్నిక



వెంకటేష్‌యాదవ్

ఎల్కతుర్తి: యాదవసంఘం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముద్దరబోయిన వెంకటేష్‌యాదవ్ ఆదివారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అర్థం ఓదేలు, ప్రచార కార్యదర్శిగా జంగం శ్రీను, ట్రెజరర్‌గా ముద్దరబోయిన సమ్మయ్య, సంఘం సభ్యులుగా జంగం సురేష్, ముద్దరబోయిన ఓదెలు, అర్థం కొమురయ్య, ముద్దరబోయిన తిరుపతి, అర్థం మల్లయ్య, సారగొల్ల పాక చంద్రమౌళి ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిరూప్‌తండా ప్రధాన రహదారి నుంచి రైల్వేగేట్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

పోగొట్టుకున్న బ్యాగు, సర్టిఫికెట్ల అందజేత

వరంగల్ చౌరస్తా: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న సర్టిఫికెట్లు ఉన్న బ్యాగ్‌ను తిరిగి బాధిత విద్యార్థికి ఆదివారం అప్పగించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్ల నుంచి హనుమకొండకు ఆర్టీసీ బస్సు వస్తుండగా, మిర్యాలగూడ వద్ద ఎం.వెంకటసాయి బస్సు ఎక్కాడు. బస్సు దిగి వెళ్తూ బస్సులోనే బ్యాగును మరిచిపోయాడు. మొబైల్ నంబర్ ఆధారంగా కాల్ చేసి విద్యార్థికి బ్యాగ్‌తోపాటు సర్టిఫికెట్లను కంట్రోలర్ యుగేందర్, సెక్యూరిటీ గార్డులు భిక్షపతి, ఆవుల విజయ్, కాంట్రాక్టర్ సీతయ్య వరంగల్ బస్టాండ్‌లో అందజేశారు.

ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణ

విద్యారణ్యపురి: రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఏ ఇంగ్లిష్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పులి సారంగపాణి, డాక్టర్ మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు యూనివర్సిటీలకు ఎంఏ ఇంగ్లిష్ ప్రవేశపరీక్ష రాసే అభ్యర్థులకు ఈనెల 26వ తేదీ ఉదయం 10గంటల నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలకు డాక్టర్ పుల్లయ్యను (99498 75510) సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత

కాజీపేట: హనుమకొండ జిల్లా కేంద్రంలోని లోటస్‌కాలనీలో ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన పేరం శ్రీనివాస్ కుటుంబానికి కాలనీవాసులు చేయూతనందించారు. ఈమేరకు బాధిత కుటుంబీలకు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.30 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నారెడ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాము వెంకటేశ్వర్లు, మహేశ్వరం గౌరీశంకర్, శ్రీనివాసచారి, మొండ్రాతి గోపాల్, కనకరాజ్, శరత్, దశరథరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సర్‌కు సన్మానం



వరంగల్ చౌరస్తా: కిక్ బాక్సింగ్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వరంగల్ రంగశాయిపేటకు చెందిన క్రీడాకారిణి మార్క సంతోషిని వరంగల్ చౌరస్తాలో శాఫ్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి ఆదివారం సన్మానించారు. సంతోషికి ఆర్థికంగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కోల గోపాల్, గోరెమియా, పోలెపాక ప్రసాద్, మట్టెవాడ కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

హసన్‌పర్తి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గోపాలపురంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామెర నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా నాగులగం నర్సయ్య, కార్యదర్శిగా తేరాల యుగంధర్, సంయుక్త కార్యదర్శులుగా మచ్చిక నరసింహరామయ్య, చిదురాల సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా కొండబత్తిని రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా సాంబయ్య, గోకారపు రాజేందర్, ఉపేంద్రచారి, అనుగం జనార్దన్, హనుమాండ్ల ప్రభాకర్, అర్జున్‌రావు, జి.యాదగిరి ఎన్నికయ్యారు.

ముదిరాజ్‌ల జోలికొస్తే ఊరుకోం..



ఆత్మకూరు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్‌లు



శాయంపేటలో..



ఎల్కతుర్తి: ముల్కనూరులో..

- ఆత్మకూరు మత్స్యపారిశ్రామిక సంఘం చైర్మన్ బయ్య తిరుపతి

ఆత్మకూరు: ఎంతటి వారైనా ముదిరాజ్‌ల జోలికొస్తే ఊరుకునేది లేదని ఆత్మకూరు మత్స్యపారిశ్రామిక సంఘం చైర్మన్ బయ్య తిరుపతి అన్నారు. ముదిరాజ్ కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను మండలకేంద్రంతోపాటు మండలంలోని నీరుకుళ్లలో ఆదివారం దహనం చేశారు. ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా, ఓటర్లు కలిగిన ముదిరాజ్ కులసంఘాన్ని హేళన చేసి మాట్లాడితే పార్టీలకతీతంగా ఒక్కటై తరిమికొడతామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో జాడలేని కౌశిక్‌రెడ్డిని ప్రజలు తరిమికొడతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుండెబోయిన భిక్షపతి, కార్యదర్శి కుక్కల రఘుపతి, బయ్య కుమారస్వామి, శ్రీనివాస్, బాషబోయిన పైడి, బయ్య పైడి, బాషబోయిన సాగర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మండలంలోని నీరుకుళ్లలో ఉడుత మహేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

శాయంపేట : మండలంలోని తహారాపూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పెద్దకోడెపాక మత్స్యసహకార సంఘం సొసైటీ డైరెక్టర్ కుక్కల తిరుపతి, కుల పెద్దలు కుక్కల శంకరయ్య, నిమ్మల రాయ్యలు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలుగు తీస్తూ సమాజానికి తెలియజేసే జర్నలిజం వృత్తిలో ఉన్న ముదిరాజ్ వ్యక్తిని అక్రమంగా బంధించి, పురుష పదజాలంతో అతనితోపాటు, ముదిరాజ్ జాతిని తిట్టడం ముదిరాజ్‌లు అందరిని అవమానపరిచినట్లే అని అన్నారు. ఎవరైనా తప్పులు చేస్తే లీగల్‌గా చూసుకోవాలని కాని, జాతిని తిట్టి అవమానపరిచే మాటలు అనకూడదని, ఎమ్మెల్సీ పదవిలో ఉండి ముదిరాజ్ జాతిని అవమానపరిచే విధంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తక్షణమే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుక్కల రవి, సతీష్, సంతోష్, మహేష్, పైడి, భాస్కర్, నరేష్, తిరుపతి, రాజు, సమ్మయ్య, దినేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో..

ఎల్కతుర్తి: ముదిరాజ్‌లను దుర్భాషలాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పెద్దమ్మతల్లి సాక్షిగా బహిరంగంగా క్షమాపన చెప్పాలని లేదంటే పార్టీ నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ కులస్తులు ఆదివారం భీమదేవపల్లి మండలం ముల్కనూరు చౌరస్తా వద్ద హనుమకొండ-సిద్దిపేట రహదారిపై ధర్నా-రాస్తారోకో నిర్వహించారు. కౌశిక్‌రెడ్డి బహిరంగంగా క్షమాపన చెప్పకుంటే ముదిరాజ్ కులస్తులను ఏకం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టకతప్పదని హెచ్చరించారు. అనంతరం కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముద్దరబోయిన శ్రీకాంత్, నాయకులు సుచ్చు రాంబాబు, అలుగు దర్మేందర్, అలుగు సంపత్, ఎట్టబోయిన నాగరాజు, ప్రశాంత్, సారయ్య పాల్గొన్నారు.

రూ.25లక్షల ఆర్థికసాయం అందజేత



ప్రభాకర్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న సొసైటీ సభ్యులు

శాయంపేట : దుండిగల్ ఎస్సై ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న 2014 బ్యాచ్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్)వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. వెల్ఫేర్ సొసైటీ తరఫున బ్యాచ్‌మెట్స్ అందరూ కలిసి రూ.25లక్షల నగదు జమ చేశారు. ఆయన కూతురు అక్షయరెడ్డి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి భార్య ప్రసన్నకు సంబంధిత పత్రాలు ఆదివారం అందించారు. ప్రభాకర్‌రెడ్డి తల్లిదండ్రులకు రూ.5లక్షల అందజేశారు. 2014 బ్యాచ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు టాటా శ్రీధర్, రామకృష్ణ, శ్రీనివాసులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

నడికూడ: ఆరె సంక్షేమ సంఘం కమిటీ మండల అధ్యక్షుడు లోకటి నగేష్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆరె సంక్షేమ సంఘం జిల్లా సలహాదారు పేర్వాల లింగమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రయోజకులు కావడమే తల్లిదండ్రులకు ఇచ్చే బహుమతి అని అన్నారు. కార్యక్రమంలో అరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వజ్ర కిషన్ రావు, రాజు, శ్రీను, రాజు, రాజేశ్వర్ రావు, రామారావు, రంజిత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి



మాట్లాడుతున్న వెంకన్న

నెక్కొండ : అన్యాక్రాంత మవుతున్న ప్రభుత్వ భూములను రక్షించడంతోపాటు భూమిలేని పేదలకు పంచాలని సీపీఎం మండల కార్యదర్శి ఈదునూరి వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం అన్యాక్రాంతమవుతున్న భూముల్లో సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 436సర్వే నంబరులో 4.38 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగాపూర్తిగా ఆక్రమణకు గురైందన్నారు. అలాగే 32 సర్వే నంబరులో 33ఎకరాల ప్రభుత్వ భూమిని పలుకుబడి ఉన్న నాయకులు భూఆక్రమణకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో మండల కేంద్రానికి చెందిన 300మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అనుభవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ఆయన కోరారు. నాయకుడు పలుసం ముత్తయ్య, సీఐటీయూ నాయకుడు వెంకటయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌పై ప్రయాణిద్దాం



సమావేశమైన అసోసియేషన్ బాధ్యులు

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌పై ప్రయాణిద్దామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సైకిల్ వాకర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సైకిల్ వాకర్స్ అందరు కలిసి సైకిల్‌పై పెద్దమ్మగడ్డ ద్వారా హనుమాన్ జంక్షన్ దగ్గరలోని గోశాలను సందర్శించారు. గోవులలో ముఖ్యమైన కపిల గోవును సైకిల్‌వాకర్స్ సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి గోశాలకు గోదానం చేశారని గోపాల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు అనంత్, రమేష్, రాములు, నరసయ్య, సాంబమూర్తి, భిక్షపతి, రాజు, రాజమౌళి, ప్రసాద్, శేఖర్ గౌడ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఏర్పాటు



సమావేశమైన ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి జి.మధు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఇళ్ల స్థలాల సాధనకు టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్ సమన్వయకర్తగా సిక్స్ మెన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, టీయూడబ్ల్యూజే(143) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బి.సదయ్య ఉంటారు. 10 రోజుల్లోగా ఇళ్ల స్థలాలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సిక్స్ మెన్ కమిటీ నిర్ణయించింది. కాకతీయ, ఏకశిల సొసైటీలకు సంబంధించిన సభ్యుల జాబితాను సిక్స్ మెన్ కమిటీకి వెంటనే అందించాలని తీర్మానం చేశారు. రెండు హౌసింగ్ సొసైటీలలో లేని వర్కింగ్ జర్నలిస్టుల పేర్లతో జాబితాను వెంటనే తయారు చేసి ప్రభుత్వానికి అందించాలని సభ్యులు నిర్ణయించారు. జాబితా రూపొందించడం కోసం పలు పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించే పనిని సిక్స్ మెన్ కమిటీ చూసుకోవాలని, వారికి సహాయంగా 15మందితో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రెస్‌క్లబ్ కోశాధికారి అమర్, తదితరులు పాల్గొన్నారు.

చిందు యక్షగాన కళాకారుడు మూగయ్యకు సన్మానం

కాజీపేట: చిందు యాక్షగానం కళ అంతరించిపోకుండా సజీవంగా ఉంచడానికి కృషి చేస్తున్న కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన గడ్డం మూగయ్యను సకల కళా సాంస్కృతిక మండలి సభ్యులు ఆదివారం సన్మానించారు. చిన్న వయస్సు నుంచే చిందు యాక్షగానంలో వివిధ పాత్రలు పోషిస్తూ సహచర మిత్రులతో కలిసి నేటి వరకూ ప్రదర్శనలిస్తూ పలువురితో మన్ననలు పొందుతున్న మూగయ్యను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం సుధాకర్ అభినందించారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కారు నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తున్నాయని వాపోయారు. ప్రదీప్, కాశీ, సాయి, రమేష్, గణేష్, ప్రవీణ్, మధు, ప్రణయ్ పాల్గొన్నారు.

నేడు పాఠశాలల బంద్

విద్యారణ్యపురి / హన్మకొండ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఈనెల 26న తలపెట్టిన పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ వరంగల్ మహానగర కార్యదర్శి ఆరెపల్లి సుజిత్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది కాలం అవుతున్నా అనేక పాఠశాలల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అని చెప్పిన సీఎం కేసీఆర్.. తన హామీని నిలబెట్టుకోలేదని ఎద్దేవాచేశారు.

అంజన్న ఆలయంలో అభిషేకాలు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని అభయాంజనేయస్వామి ఆలయంలో దేవతామూర్తులకు ఆదివారం క్షీరాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఆదిగణపతి, అభయాంజనేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేయడంతో పాటు నూతన వస్త్రాలతో అలంకరించారు.

రెగ్యులరైజ్ చేయాలి



కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు కోరారు. హైదరాబాద్‌లో విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ జనరల్ సోల్తి కిరణ్‌గౌడ్ తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాతలకు సర్టిఫికెట్ అందిస్తున్న అతిథులు

హన్మకొండ: రక్తదానం మరొకరికి ప్రాణదానమని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండ ఇందిరానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఇందిరానగర్‌లో రక్తదానం శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వసంత మాట్లాడుతూ ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయొచ్చని సూచించారు. ఈ సందర్భంగా అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన తాటిపల్లి జనార్దన్ రెడ్డిని సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి పాపిరెడ్డి, ఈవీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ల్యాదెళ్లలో శిబిరానికి హాజరైన ప్రజలు

దామెర: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పెసరు విజయచందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్, ఐఎంఏ సంయుక్తంగా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో సర్పంచ్ కుక్క శ్రావణ్యఅనిల్, ఉపసర్పంచ్ మాదాసుకీర్తివెంకటేశ్వర్ రావు, దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, డాక్టర్ కాశీప్రసాద్, రాకేష్, సుధాకర్ రెడ్డి, ఆనందర్ భోత్ర, మోహన్‌రావు, సనత్, అజిత్ మహమ్మద్, నిఖిత, జైలాదితోపాటు పలు విభాగాలకు చెందిన 20 మంది స్పెషలిస్టులు, 15 మంది సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే విజయం



శాయంపేట : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



పరకాల: బీసీ కాలనీలో..

- కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

శాయంపేట : రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడడం ఖాయమని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు పుల్యాల నరేందర్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ 9ఏళ్ల పాలన విజయవంతంపై మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు బాసాని విద్యాసాగర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరకాల: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కేంద్రంలో.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజల బతుకులు బాగుపడుతాయన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మేకల రాజవీర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుక్కల విజయ్‌కుమార్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు అశోక్, చెరిపల్లి సునీల్, ఒంటేరు వీరేశం, నారాయణదాసు, పాలకుర్తి తిరుపతి, దామ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- చేనేత సొసైటీ ఉపాధ్యక్షుడు సాంబయ్య



బీమా పత్రాలతో చేనేతకార్మికులు

శాయంపేట : సీఎం కేసీఆర్ రైతు బీమా తరహాలో నేతన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలుచేస్తూ, చేనేత రంగానికి పెద్దపీట వేస్తున్నారని చేనేత సొసైటీ ఉపాధ్యక్షుడు బాసాని సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అందజేసిన నేతన్న బీమా పత్రాలను ఆదివారం కార్మికులకు అందజేశారు. చేనేత కార్మికుల అకాల మృతికి రూ.5లక్షల బీమా వర్తింపజేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, రంగ ఆనందం, దిడ్డి ప్రభాకర పాల్గొన్నారు.

నాటి చీకటి రోజులు మరిచిపోలేం



సాదు సర్వేశాన్ని సన్మానిస్తున్న నాయకులు

పరకాల: 1975 జూన్ 25న అర్ధరాత్రి అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిన చీకటి రోజులను ప్రజలు మరిచిపోలేకపోతున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సాదు సర్వేశాన్ని బీజేపీ నాయకులు ఆదివారం సన్మానించారు. ప్రభుత్వ నిర్బంధానికి భయపడకుండా నాడు నిరసనలు తెలిపి జైలు పాలుకావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కుక్కల విజయ్, ఉపాధ్యక్షుడు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, సీనియర్ నాయకుడు దుబాసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మడికొండ: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. 46వ డివిజన్ రాంపూర్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రాజయ్య ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం, రాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు మునిగాల వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగాల సరోజన, మాజీ డీఎస్పీ మునిగాల విలియం, ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ ఒంటేరు రమేష్, తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ సంఘం వ్యవస్థాపకుడు కేబీ.రాజు, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.అయిలయ్య, ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, రాంపూర్ గ్రామ అంబేడ్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు తప్పెట సారయ్య పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం..



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ బాధ్యులు

వర్ధన్నపేట : వాసవీ, వనిత క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు కొనసాగించి ఆదర్శంగా నిలుస్తామని వర్ధన్నపేట వాసవీ, వనిత క్లబ్ అధ్యక్షురాలు యాంసాని రాధిక అన్నారు. ఆదివారం వాసవీ, వనిత క్లబ్ ద్వారా డాన్ టూ డస్క్(ఉదయం నుంచి సాయంత్రం వరకు) చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా వర్ధన్నపేట పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీల బహూకరించడంతో పాటు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరం ఐక్యంగా ఉండి పట్టణంలో తమ వంతు కృషిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మాణం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అడ్డగూడి లావణ్య, కోశాధికారి పెనుమాటి హైమావతి, సభ్యులు శ్రీరాం రాజేశ్వరి, పెనుమాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.